





అభివృద్ధి అంతంత మాత్రమే



గుంతలమయంగా మారిన బోయవాడ రోడ్డు (ఫైల్)

- అరకొర నిధులతో అవస్థలు
- పెండింగ్‌లో బిల్లులు
- ముందుకు కదలని పనులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బకాయిలను ఇవ్వక పోవడం, నిధులను ప్రభుత్వం విడుదల చేయక పోవడంతో అభివృద్ధి పనులు ముందకు కదలడం లేదు. జిల్లాలో ఏడాది కాలంగా ఒక అడుగు ముందుకు రెండడుగుల వెనక్కి అన్నచందంగా అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఉపాధి హామీ పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులతో అక్కడక్కడ అంతర్గత రోడ్లు, మంచినీటి పైపులైన్లు, డ్రైనేజీల నిర్మాణాలు, ఓపెన్ జిమ్స్, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాల వంటి చిన్నచిన్న పనులు జరుగుతున్నాయి. ఎంపీ, ఎమ్మెల్యే, గ్రామపంచాయతీ నిధులతో గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు కోట్లలోనే బకాయి ఉండగా ప్రభుత్వం వాటిని విడుదల చేయక పోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలకే పరిమితమవుతున్నాయి.

● నగరంలో అసంపూర్తి పనులు

గత ప్రభుత్వ హయాంలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సీఎం హామీ పనులు, పట్టణ ప్రగతి నిధులు, స్మార్ట్‌సిటీ, ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు జరిగాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం హామీ, పట్టణ ప్రగతి నిధులను విడుదల పూర్తిగా నిలిపివేసింది. పట్టణ ప్రగతికి సంబంధించి 12 కోట్ల రూపాయలను కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. వాటిని కూడా విడుదల చేయలేదు. దీంతో గతంలో పనులు ప్రారంభించిన పనులు కూడా అర్ధాంతరంగా నిలిచిపోగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసిన పనులను చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. నగరంలో దాదాపు 50కిపైగా రోడ్లు, నాలుగు ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, కళాభవన్ వంటి పనులను అసంపూర్తిగానే వదిలివేశారు. ఇటీవల సీఎం ప్రత్యేక నిధుల నుంచి 32 కోట్లను మంజూరు చేసినట్లు బడ్జెట్ రిలీజింగ్ ఆర్డర్‌ను జారీ చేసిన ప్రభుత్వం ఇప్పటికీ ఆ నిధులను విడుదల చేయలేదు. గతంలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కింద కేంద్ర ప్రభుత్వం తమ వాటాగా ఇచ్చిన 100 కోట్లతోపాటు రాష్ట్ర ప్రభుత్వం 100కోట్లను విడుదల చేసినా అవి పెండింగ్ పనుల బిల్లుల చెల్లింపులకే సరిపోయాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు 3 కోట్లు, అమృత్-2 147 కోట్లనిధులతో మంచినీటి పైపులైన్ల పనులు, కమ్యూనిటీ హాల్స్ వంటి పనులు చేపడుతున్నారు.

● 'శాతవాహన'కు ఇంజనీరింగ్, లా కళాశాల

శాతవాహన యూనివర్సిటీకి కొత్తగా ఒక ఇంజనీరింగ్, లా కళాశాలను మంజూరు చేయడంతోపాటు ఫార్మసీ వసతి గృహ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఎంపీ, ఎమ్మెల్యే నిధులు 40 లక్షలతో జిల్లా గ్రంథాలయ సంస్థ భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. మరో ఆరు కోట్లతో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతిపాదనలను పంపించారు. కరీంనగర్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రహదారుల నిర్మాణాలకు టెండర్ ప్రక్రియ నిర్వహించినా కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాకపోవడంతో ఆ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. దుర్శేడ్-గుంటూరు పల్లె బీటీ రోడ్డు భూమి

మిగతా 8వ పేజీలో..

● అంధకారంలో తీగల వంతెన

మానేరుపై నిర్మించిన తీగల వంతెన నిర్వహణలోపంతో అంధకారంలో మునిగిపోయింది. మిగిలిన పనులను, నిర్వహణ బాధ్యతలను పూర్తిగా వదిలివేశారు. నిధులలేమి కారణంగా మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులు చేతులెత్తేయడంతో వెలుగులతో విరాజిల్లిన తీగలవంతెన ఇప్పుడు చీకట్లో మగ్గుతూ ప్రమాదాలకు నిలయంగా మారింది. 410 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన మానేరు రివర్ ఫ్రంట్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మొదటి దశలో 74 శాతం పనులు పూర్తికాగా అంచనా వ్యయం 470 కోట్లకు చేరింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 234 కోట్లను విడుదల చేసినప్పటికి ఇంకా పనులు ప్రారంభం కాలేదు. కార్పొరేషన్‌లో పరిధిలోని అల్గునూర్‌లో 40 కోట్లతో అంగన్‌వాడీ, పీహెచ్‌సీ, రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టారు.

దివ్యాంగుల జాబ్‌మేళాను సందర్శించి ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

దివ్యాంగుల జాబ్‌మేళాకు స్పందన

- 348 మంది హాజరు..

108 మంది ఎంపిక

కరీంనగర్ టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లలు, విక లాంగులు, వయోవృద్ధుల శాఖ, యూత్ ఫర్ జాబ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల జాబ్ మేళాకు స్పందన లభించింది. 17 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. 348 మంది దివ్యాంగులు ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోగా అందులో 102 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జాబ్‌మేళాను కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించి కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి ఉద్యోగాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపిక విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా సంక్షేమాధికారి సబిత, యూత్ జాబ్స్ కోఆర్డినేటర్స్ మధుసూదన్, షాహిద్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు, వారధి సెక్రెటరీ ఆంజనేయులు, సీడీపీవోలు కస్తూరి, సుగుణ, శ్రీమతి, ఎఫ్ఆర్వో రఫీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలు ప్రారంభం

- 30 జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు

6

పత్తి ధర పెరిగేనా..?

- ఆశగా చూస్తున్న రైతులు
- అమ్మకుండా ఇళ్లలో నిల్వ



హుజూరాబాద్ మండలం కాట్రపల్లిలో సాగు చేస్తున్న పత్తి

హుజూరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పత్తి ధర పెరుగుతుందోమోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కొంత మంది రైతులు ఇప్పటికే పత్తిని విక్రయించగా, మరికొంత మంది ఇంట్లో నిల్వ చేసుకున్నారు. డివిజన్‌లోని హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం మండలాల్లో 1.20 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తుండగా, అందులో సుమారు 25 వేల ఎకరాల్లో పత్తిని సాగు చేశారు.

● పెరిగిన పెట్టుబడులు

పత్తి విత్తినప్పుడు వర్షాలు కురవకపోవడంతో విత్తనాలు పాట్లిపోయాయి. మళ్లీ రైతులు విత్తనాలను వేశారు. విత్తనం మొలకెత్తిన నాటి నుంచి రైతులు పత్తి పంటకు వివిధ రకాల మందులను పిచికారి చేశారు. దీంతో పెట్టుబడులు పెరిగాయి. సాధరణ పరిస్థితులో ఎకరానికి 20 వేల దాటని పెట్టుబడులు ఈ సారి 30 వేల రూపాయల వరకు పెరిగాయి. పూత దశలో దోమ, పురుగు ఉధృతి ఎక్కువ ఉంది. దిగుబడి ఎకరానికి సగటున ఎనిమిది నుంచి 10 క్వింటాళ్ల వరకు వచ్చింది. పంట చేతికచ్చే దశలో వర్షాలు కురిశాయి. పత్తి నల్లగా మారింది. అది ధరపై ప్రభావం చూపించింది. నల్లబారిన పత్తిని కొనడానికి వ్యాపారులు ముందుకు రాలేదు. కొంతమంది రైతులు క్వింటాల్‌కు 6,500 నుంచి 6900 వరకు ధరకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుని ఆర్థికంగా నష్టపోయారు. మరి కొంత మంది ధర పెరుగుతుందోమోననే ఆశతో ఇళ్లలో నిల్వ చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధర నాణ్యత ప్రమాణాలను అనుసరించి 6900 నుంచి 7,521 రూపాయల వరకు నిర్ణయించింది. సీసీఐ మార్కెట్‌లో కొనుగోలు చేయక పోవడంతో చాలా మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు పత్తిని విక్రయించారు. సీసీఐ సిబ్బంది నాణ్యత పేరుతో కొర్రీలు పెట్టారు. కొందరికి మాత్రమే 7,521 రూపాయల మద్దతు ధర లభించింది. సాధారణంగా నల్లరేగడి నేలల్లో పండే పత్తి నాణ్యంగా ఉండి ఎక్కువ ధర లభిస్తుంది. హుజూరాబాద్ డివిజన్‌లో ఎక్కువగా ఎర్ర చెలక నేలలు ఉండడంతో పత్తికి 7,200 రూపాయలకు మించి ధర లభించడం లేదు. గతంలో సీజన్ చివరలో ధరలు పెరగడంతో ముందుగా అమ్ముకున్న వారు నష్టపోయారు. ఈ సారి దిగుబడులు తగ్గడంతో ధర పెరుగుతుందోమోననే ఆశతో రైతులు పత్తిని అమ్మకుండా ఇళ్లలో నిల్వ చేసుకుం టున్నారు.



హుజూరాబాద్ పరిధి దమ్మక్కపేటలో ఇంట్లో నిల్వ ఉన్న పత్తి

ధర పెరుగుతుందని ఎదురు చూస్తున్నాం..

- సురేందర్‌రెడ్డి, రైతు, రాములపల్లి



ఈ ఏడాది పత్తి ధర బాగా ఉంటుందని పత్తి పంటను సాగు చేశాను. పత్తి విక్రయించే సమయంలో ధర లేకపోవడంతో కొంత పత్తిని అమ్మి, మరికొంత పత్తిని ఇంట్లోనే నిల్వ చేసుకున్నాను. ప్రస్తుతం క్వింటాలుకు 6900 రూపాయలకు మించి ధర పెట్టడం లేదు. ఈసారి చీడపీడలు ఎక్కువ ఉండి పత్తి దిగుబడి తగ్గింది. ధర పెరుగుతుందని ఆశగా ఎదురుచూస్తున్నాం.

కలెక్టర్‌కు యూనిసెఫ్ ప్రశంస



కలెక్టర్ పమేలా సత్పతికి ప్రశంసా పత్రం అందజేస్తున్న యూనిసెఫ్ ప్రతినిధి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలకు నాంది పలుకుతున్న కలెక్టర్ పమేలా సత్పతిని యూనిసెఫ్ ప్రశంసించింది. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్‌కు యూనిసెఫ్ రాష్ట్ర వాష్ స్పెషలిస్టు వెంకటేశ్ ప్రశంసా పత్రాన్ని అంద జేశారు. కలెక్టర్ పమేలా సత్పతి పారిశుధ్య కార్మికుల రక్షణ పలు చర్యలు తీసుకున్నారు. కార్మికులకు బీమా సౌకర్యం, ఆరోగ్య పరీక్ష కార్డుల పంపిణీ, పని చేస్తున్న పుడు ధరించేందు రక్షణ కవచాలు అందజేశారు. కార్మికులకు కావాల్సిన సౌకర్యాలపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తు న్నారని యూనిసెఫ్ మూడు రాష్ట్రాల చీఫ్ జిలాలెమ్ బి టఫస్సీ ప్రశంసించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ రాష్ట్ర కన్సల్టెంట్ ఫణీంద్ర కుమార్, జిల్లా సమన్వయకర్త కిషన్ స్వామి, స్వచ్ఛ భారత్ జిల్లా సమన్వయకర్తలు రమేష్, వేణుప్రసాద్, క్లస్టర్ ఫెసిలి టేటర్లు కళ్యాణి, రవీందర్ పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానోత్సవం వాయిదా

కరీంనగర్ కల్చరల్, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ, తెలంగాణ లఘు చిత్రాల నిర్మాతల మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించాల్సిన రాష్ట్రస్థాయి లఘు చిత్రాల అవార్డుల ప్రదానో త్సవం వాయిదా వేసినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో రాష్ట్ర ప్రభుత్వం వారం రోజుల పాటు సంతాపదినాలుగా ప్రకటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామ న్నారు. కార్యక్రమం నిర్వహించే తేదీని కొద్ది రోజులు ప్రకటిస్తామని తెలిపారు.





చోరీకి యత్నం

- పోలీసులకు అప్పగింత

చందుర్తి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం నర్సింగాపూర్‌లో యువకుడి పట్టుకున్న గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు. మెదక్ జిల్లా కేంద్రంలోని అజంపూర్ గల్లీకి చెందిన ఓల్లపు గణేష్ శుక్రవారం నర్సింగాపూర్‌కు చెందిన పెరుక లస్మయ్య ఇంటి కిటికీని తవ్వి తీసుకెళ్లేందుకు యత్నించాడు. గమ నించిన గ్రామస్థులు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

బొమ్మల దుకాణంలో చోరీ

వేములవాడ, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని బద్ది పోచమ్మ వీధిలోని రంగు మల్లేశంకు చెందిన బొమ్మల దుకాణంలో గురువారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఉదయం దుకాణం తీసేందుకు వచ్చిన మల్లేశం పరిసరాలను గమనించి సీసీ కెమెరా పుటేజీని పరిశీలించాడు. రాత్రి సమయంలో పరదా జరుపుకొని లోపటికి వచ్చి దుకాణంలోని వస్తువులతోపాటు 5 వేల రూపాయల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరా దృశ్యాలను పోలీసులకు అందజేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని జిల్లా ఆస్పత్రి వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి గేటు పక్కన పడుకొని చనిపోయి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడు చామనచాయ రంగులో, ఒంటిపై బూడిద రంగు స్వెటర్ బూడిద రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.



విలీనం దిశగా విప్లవ సంఘాలు



- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రెండు గ్రూపుల విలీనం..
- నేడు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభ..

గోదావరిఖని, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొంటూ.. మరెన్నో ఎదురుదెబ్బలు తింటున్న విప్లవోద్యమాలు చికిత్స కారకాలను అనేషిస్తున్నాయి. సుదీర్ఘ ప్రతిపాదనలు, చర్చోపచర్చల అనంతరం రెండు తెలుగు రాష్ట్రాల్లో బలమైన భూమిక ఉన్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలు ఏకమవుతున్నాయి. విప్లవ గ్రూపుల మధ్య చిన్నచిన్న విషయాలు, తగాదాలకు చీలికలు ఏర్పడడం ప్రజా, విప్లవ ఉద్యమాల విస్తరణకు విఘాతమని భావించి రెండు ఎంఎల్ గ్రూపులు విలీనమై బలమైన విప్లవ శక్తిగా మారనున్నాయి. వేములపల్లి వెంకట్రామయ్య, సూర్యం నాయకత్వంలో నడుస్తున్న వర్గంతో చంద్రన్న నాయకత్వంలో నడుస్తున్న మరో వర్గంలోని ప్రముఖులైన సాదినేని వెంకటేశ్వర్‌రావు, గోవర్ధన్‌ల నాయకత్వంలో రెండు ఎంఎల్ గ్రూపులు విలీనమవుతున్నాయి.

● విభేదాల కారణంగా..

2013కు ముందు వీళ్లంతా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీగానే పని చేశారు. విధానపరమైన విభేదాల కారణంగా చంద్రన్న, నాయకత్వంలో ఒక గ్రూప్‌గా ఏర్పడింది. చంద్రన్న నాయకత్వంలో గోవర్ధన్, ఎస్‌పీ తదితరులు వెళ్లడంతో న్యూడెమోక్రసీలో చీలిక సంభవించింది. తరువాత దశాబ్ద కాలం రెండు ఎంఎల్ గ్రూపులు ఎదుర్కొన్న అనేక అనుభవాలను సమీ క్షించుకుని వీపీ వర్గం నుంచి విప్లవ శక్తులు కలిసి పనిచేయాలనే ప్రతి పాదన మొదలైంది. ఈ మధ్య జరిగిన న్యూడెమోక్రసీ జాతీయ మహాసభల్లో కూడా ఈ అంశంపై చర్చించారు. విప్లవ శక్తులను ఏకం చేయడం వల్లనే భారత విప్లవోద్యమం బలపడుతుందనే అభిప్రాయానికి న్యూడెమోక్రసీ వచ్చింది. ఈ చర్చల్లో భాగంగా చంద్రన్న న్యూడెమోక్రసీ నుంచి ప్రధాన నాయకత్వం, క్యాడర్ గతంలో ఉన్న న్యూడెమోక్రసీలో విలీనం కావడానికి సంసిద్ధులయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ రెండు ఎంఎల్ గ్రూపులు విలీనమవుతున్నాయి. ఇదొక చారిత్రాత్మక సందర్భం. ఈ రెండు గ్రూపులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రెండు రకాల పోరాట రూపాలను నిర్వహి స్తున్నాయి. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీకి సాయుధ దళాలు ఉద్యమాన్ని కొనసాగిస్తుండగా, ఐఎఫ్‌టీయూ బ్యానర్‌పై కార్మికోద్యమంలో బలమైన పాత్ర పోషిస్తున్నారు. సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఐఎఫ్‌టీయూ బలమైన సంఘంగా కొనసా గుతున్నది. అయితే చంద్రన్న మాత్రం ఈ విలీ నంలో పాల్గొనడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సీపీఐ (ఎంఎల్) జనశక్తి ఒక బలమైన విప్లవ పార్టీగా కొనసా గుతున్నది. అలాగే సీపీఐ(ఎంఎల్) (క్లాస్ స్ట్రగుల్) మరో పార్టీగా పని చేస్తున్నది. ఇవి రెండు కాకుండా సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నుంచి 2013లో ఏర్పడిన చంద్రన్న చీలికవర్గం ప్రధాన నాయకులు న్యూడెమోక్రసీ పాత పార్టీలో విలీనమవుతున్నారు. దీంతో సీపీఐ(ఎంఎల్) న్యూడె మోక్రసీకి సంబంధించిన రెండు వర్గాలకు అను బంధంగా పని చేస్తున్న ఐఎఫ్ టీయూ, ఏఐకే ఎంఎస్, పీడీఎస్‌యూ, పీవోడబ్ల్యూ, పీవైఎల్, అరుణోదయ లాంటి సంఘాలన్నీ తిరిగి ఏకమ వుతున్నాయి. ఈ పరిణామం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీకి నూతన ఉత్తేజాన్ని కల్పించడమే కాకుండా ఒక బలమైన విప్లవ శక్తిగా ఎదిగే అవకాశాన్ని ఇవ్వనుంది.

● ఇతర రాష్ట్రాల్లోనూ..

దేశంలో విప్లవం రావాలని కోరుకునే విప్లవశక్తులన్నీ కలిసి పని చేయాలనే ప్రాతిపదికన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకత్వం గత కొద్ది కాలంగా బెంగాల్, అస్సాం, త్రిపుర రాష్ట్రాల్లో బలమైన విప్లవోద్యమాలు కొనసాగిస్తున్న ప్రొవెన్షియల్ సెంట్రల్ కమిటీ అనే విప్లవ సంస్థతో కూడా చర్చలు జరుపుతున్నది. తమిళనాడులో స్టేట్ ఆర్గనైజింగ్ కమిటీ(ఎస్‌వోసీ) అనే ఎంఎల్ గ్రూప్‌తో కూడా న్యూడెమోక్రసీ నాయకత్వం కలిసి పనిచేసే ప్రతిపాదనలను పంపించింది. అలాగే ప్రజాస్వామిక పంథాలో విప్లవ నేపథ్యం కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ), భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్ట్)లాంటి భావసారుప్యత గల పార్టీలతో కూడా కలిసి నడవాలని న్యూడెమోక్రసీ అగ్రనాయకత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది.

ఇలా ఒకవైపు విప్లవోద్యమాలను ఉధృతం చేస్తూనే దేశ వ్యాప్తంగా ఉన్న ఎంఎల్ గ్రూప్‌లను ఏకం చేసేందుకు న్యూడెమోక్రసీ అగ్రనాయకత్వం పనిచేస్తున్నది. ఇలాంటి గ్రూప్‌లను ఏకం చేసేందుకు శనివారం జరిగే విలీన ప్రక్రియ నాంది పలకనున్నది. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రెండు పార్టీల విలీన సభలో అధ్యక్షవర్గంగా ఇటు వేములపల్లి వెంకట్రామయ్య అటు సాదినేని వెంకటేశ్వర్‌రావు పాల్గొనున్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జాతీయ అధికార ప్రతినిధి దర్శన్‌సింగ్ ఖట్కర్ ముఖ్య అతిథిగా ఈ విలీన సభకు హాజరవుతున్నారు. వక్తలుగా వై సాంబశివరావు, జేవీ చలపతిరావు, పీ ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కే గోవర్ధన్, జీ ఝాన్సీ, వీ సంధ్య, ఆవునూరి మధు, సీఎస్ సాగర్ పాల్గొని ప్రసంగిస్తారు. అరుణోదయ కళా బృందాలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నాయి.

పెళ్లికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగ్గసాగర్ గ్రామానికి చెందిన పూసాల నరేందర్ హైదరాబాద్‌లో పెళ్లికి వెళ్లి అదృశ్యమైన విషయం ఆలస్యంగా వెలిగులోకి వచ్చింది. శుక్రవారం కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం...పూసాల నరేందర్‌కు మతిమరపు వ్యాధి ఉంది. గురువారం మేనల్లుడి వివాహం హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉండడంతో కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. భోజనం చేసినంతరం ఫంక్షన్ హాల్ నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి కనిపించకుండా పోయాడు. ఆచూకి తెలిస్తే ఫోన్ 9177572737 నంబర్‌కు తెలపాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

గాయపడ్డ యువకుడి మృతి

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని కేటీఆర్ కాలనీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై కిరణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని కోండ్రికర్ల గ్రామానికి చెందిన నంద సురేష్(38)అను టీవీ రిపేర్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల జగ్గసా గర్‌లో జరిగిన శుభకార్యంలో పాల్గొన్న అనంతరం తన కారులో మెట్‌పల్లికి బయలు దేరాడు. ఈ క్రమంలో వెల్లుల్ల గ్రామంలోని కేటీఆర్ కాలనీ సమీపంలో ఎదురుగా అతి వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించి స్థానికులు మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైనా చికిత్స కోసం కుటుంబ సభ్యులు నిజామాబాద్‌లోని ఆసపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి నంద సురేష్ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నంద సురేష్‌కు భార్య, కూతురు ఉన్నారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

- క్రిస్మస్ వేడుకలకు అమ్మమ్మ ఇంటికి రాక
- సైకిల్‌పై వెళ్తుండగా ఢీకొట్టిన లారీ



సాత్విక్(ఫైల్)

వేములవాడ టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండగ కోసం అమ్మ మ్మ ఇంటికి వచ్చిన బాలుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్న సంఘటన స్థానికంగా విషాదం నింపింది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన చంటి సరిత-రాజు దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు చంటి సాత్విక్ (12) క్రిస్మస్ పండగ సందర్భంగా మూడు రోజుల క్రితం తన అమ్మమ్మ గ్రామమైన వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లికి వచ్చాడు. శుక్రవారం కూడా సెలవు కావడంతో ఆలస్యంగా ఇంటికి వెళ్లాలనుకున్నాడు. ఈలోగా చాక్లెట్ కొనుక్కోవడానికి అమ్మమ్మ డబ్బులు ఇవ్వడంతో సైకిల్‌పై వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన సాత్విక్ అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడిని ఢీకొట్టి తప్పించుకుకుని వెళ్తున్న లారీని గ్రామస్థులు వెంబడించి వట్టెంల శివారులో పట్టుకున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడు..



మహేందర్(ఫైల్)

సైదాపూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలం రామచంద్రాపూర్ గ్రామ సమీపంలో గురువారం అర్ధరాత్రి బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలం లోని దుద్దెనపల్లి గ్రామానికి చెందిన పొన్నం మహేందర్ (26) ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. జాగీర్‌పల్లిలో వివాహానికి హాజరై హుజూరాబాద్ వైపు వెళ్తుండగా రామచంద్రాపూర్ గ్రామ సమీపంలోని మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టాడు. తీవ్ర గాయాలై మహేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మహేందర్ సోదరుడు పొన్నం కుమారస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్ల పోలీసులు తెలిపారు.

ఒకరికి తీవ్ర గాయాలు

గన్నేరువరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మాజిపల్లి గ్రామానికి చెందిన మిషన్ భగీరథ పంప్ ఆపరేటర్ సొల్లు మల్లేశంకు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గయాలయాయయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేశం గురువారం ద్విచక్రవాహనంపై భార్య తారతో కలిసి బంధువుల వివాహ వేడుకకు బయలు దేరాడు. గుండ్లపల్లి చెరువు కట్టపై నుంచి వెళుతుండగా వరంగల్ జిల్లా, పాసరగండ్ల గ్రామానికి చెందిన బుర్రి రాజ్‌కుమార్ కారుతో (టీఎస్26ఈ8846) బైక్‌ను ఢీకొట్టాడు. కింద పడిన మల్లేశంకు తలకు ముఖానికి తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని వెల్‌నెస్ సెంటర్‌కు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని మల్లేశం తమ్ముడు సొల్లు రమేష్ శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ రాధాకిషన్ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

బోయినపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం స్తంభంపల్లికి చెందిన పర్శ సుందరయ్య (70) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సుందరయ్య కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తనకు నయం కాదని ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పృథ్వీదర్ గౌడ్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలు ప్రారంభం



జూడో పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్, జూడో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, తదితరులు

» 30 జిల్లాల నుంచి 330 మంది క్రీడాకారులు హాజరు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చీఫ్ మినిస్టర్స్ కప్-2024 జూడో చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ పోటీలకు తెలంగాణ రాష్ట్రంలోని 30 జిల్లాల నుంచి 330 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలకు హాజరైన క్రీడాకారులకు ఆయా వెయిట్ కేటగిరీలకు సంబంధించి సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. తొలిరోజు బాలుర విభాగంలో 35, 40, 60, 66 కిలోలలోపు విభాగాల్లో, బాలికల విభాగంలో 40, 44, 63, 70 కిలోల విభాగాల్లో పోటీలను ప్రారంభించారు. అంతకు ముందు ఈ పోటీలను తెలంగాణ రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో జూడో క్రీడకు కేరాఫ్ అడ్రస్‌గా కరీంనగర్ జిల్లా నిలుస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్య మిస్తున్నారని తెలిపారు. ఈ పోటీలతో ఎందరో నూతన క్రీడాకారులు వెలుగులోకి వచ్చారన్నారు. జిల్లా యువజన క్రీడాశాఖాధికారి వి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం కప్ జూడో పోటీల్లో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఈ పోటీలకు 30 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరుకావడం అభినందనీయమన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, వెంకట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సెపక్‌తక్రా జిల్లా అధ్యక్షుడు గంప వెంకట్, జిమ్నాస్టిక్ సంఘాల అధ్యక్షులు కన్న కృష్ణ, డి నిరంజనాచారి, కబడ్డీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ సంపత్‌రావు, ఖో-ఖో సంఘ రాష్ట్ర రెఫరీ బోర్డు కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాశ్, భారత జూడో సంఘం కోశాధికారి కైలాసం యాదవ్, జిల్లా పెటా కార్యదర్శి ఎండీ యూనిస్ పాషా, టోర్నమెంట్ ఇన్‌చార్జి ఎన్ రాజు, తెలంగాణ ఒలింపిక్ సంఘ సభ్యులు సిలివేరి మహేందర్, రెఫరీలు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



జూడోలో తలపడుతున్న క్రీడాకారులు

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ఓదెల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లిలో శుక్రవారం శనిగరపు కుమార్ అనే వ్యక్తికి చెందిన ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో ఇంటిలో అతుకులుగా ఉన్న సర్వీస్ వైర్ ఒకదానికొకటి అంటుకొని ఈ ప్రమాదం జరిగినట్లు బాధితులు తెలిపారు. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పివేశారు. ఇంట్లోని విలువైన సామగ్రి పూర్తిగా కాలిపోయింది. దీంతో రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. బాధితులను ఆదుకోవాలని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు రమేష్ అధికారులను కోరారు.

కుమ్మరిపల్లి కేజీబీవీ ఎదుట ఆందోళన

● సమ్మెలో కేజీబీవీ సిబ్బంది ● సర్దుబాటు చేసిన అధికారులు ● తిరస్కరించిన విద్యార్థినులు



జగిత్యాల జిల్లా కుమ్మరిపల్లిలో ఆందోళన చేస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థినులు

వెల్గటూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమ టీచర్లు తమకే కావాలంటూ జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి కేజీబీవీ విద్యార్థులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. సమగ్రశిక్ష ద్వారా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది తమను రెగ్యులరైజ్ చేయాలని 18 రోజులుగా జగిత్యాల జిల్లా కేంద్రంలో సమ్మె నిర్వహిస్తున్నారు. విద్యార్థినులకు నష్టం జరుగకుండా మొదట కొంత మంది సిబ్బంది పాఠాలు బోధించారు. మరి కొద్ది మంది సిబ్బంది సమ్మెలో వంతుల వారీగా పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో పూర్తి స్థాయిలో సమ్మెలో పాల్గొనాలని రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. ఈ మేరకు పూర్తి స్థాయిలో సమ్మెలో పాల్గొంటున్నట్లు మూడు రోజుల క్రితం జగిత్యాల డీఈవో రాముకు కేజీబీవీ సిబ్బంది వినతి పత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో విద్యాబోధన కుంటు పడకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల మహిళ ఉపాధ్యాయులను కేజీబీవీలో విధులు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఇన్‌చార్జి ప్రత్యేక అధికారిగా గొడిసెలపేట బీసీ కాలనీలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు సుశీలను నియమించారు. ఆమె శుక్రవారం పాఠశాలకు రావడంతో ఒక్కసారిగా విద్యార్థులు నిరసనకు దిగారు. పాఠశాల ఆవరణలో బైఠాయించి తమ టీచర్లు తమకు కావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆమెను పాఠశాల లోపలికి రాని వ్వకుండా అడ్డుకున్నారు. దీంతో చేసేది లేక ఆమె వెనుతిరిగి వెళ్లిపోయారు. దీంతో జిల్లా విద్యాధికారి రాము పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి పరిస్థితిని సమీక్షించి వెళ్లారు.



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న పూర్ణిమ

కర్షక నారీ

పీజీ చదివి.. వ్యవసాయంపై ఆసక్తి



ఒడ్లు చెక్కుతున్న పూర్ణిమ

● పొలం పనుల్లో మహిళా రైతు పూర్ణిమ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యనభ్యసించిన ఆమెకు వ్యవసాయం అంటే ఆసక్తి. దీంతో భర్తకు తోడుగా పొలంబాట పట్టింది. మగవారితో పోటీ పడుతూ పనులు చేస్తోంది. మహిళలకు అవకాశం వస్తే అన్నింటా రాణిస్తామని చాటిచెబుతోంది. ఎల్లారెడ్డిపేట మండలం మండలంలోని గొల్లపల్లికి చెందిన దాసరి పూర్ణిమ- గణేశ్ దంపతులకు ఆరెకరాల వ్యవసాయం ఉంది. భర్త గణేశ్ వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. పూర్ణిమ ఎమ్మెస్సీ మ్యాథ్స్ పూర్తి చేసింది. సాగుకు కూలీల కొరత, పెట్టుబడి పెరగడం, చిన్నతనం నుంచి వ్యవసాయంపై ఆసక్తి ఉండడంతో పొలం పనులు చేయాలని భావించింది. భర్త గణేశ్‌తో కలిసి మూడేళ్ల కిందట పొలం బాట పట్టింది. మొదట చిన్నచిన్న పనులు నేర్చుకుంది. ట్రాక్టర్ దున్నేందుకు, ఒడ్లు చెక్కడానికి కూలీలకు అధిక డబ్బు ఖర్చవుతోందని గమనించింది. భర్త సహాయంతో ట్రాక్టర్ నడపడం, ఒడ్లు చెక్కడం నేర్చుకుంది. పూర్ణిమకు వ్యవసాయంపై ఉన్న ఆసక్తిని గమనించిన భర్త వారికున్న ఆరు ఎకరాలతోపాటు మరో పది ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంటను సాగు చేస్తున్నారు. పొలం దున్నడం మొదలు నాట్లు వేసే వరకు పూర్ణిమ అన్ని పనుల్లో ముందుంటోంది. కష్టతరమైన పనులను ఇష్టంతో చేస్తోంది. ట్రాక్టర్‌తో పొలం దున్నడం దగ్గర నుంచి ఒడ్లు చెక్కడం, నాట్లు వేయడం వరకు చకచకా చేస్తోంది. కోతల అనంతరం ధాన్యాన్ని కూడా కొనుగోలు కేంద్రానికి తరలిస్తోంది. పూర్ణిమ పొలం బాట పట్టడంతో రూ.64 వేలు పెట్టుబడి తగ్గిందని, వరి కోతలకు వచ్చే వరకు మరో రూ.50 వేలు మిగులుతున్నాయని గణేష్ పేర్కొంటున్నాడు.



పెట్టుబడి తగ్గింది

- దాసరి పూర్ణిమ, మహిళా రైతు

నేను ఎమ్మెస్సీ మ్యాథ్స్ చదువుకున్నా. మాకున్న ఆరెకరాలతోపాటు మరో పదెకరాలు కౌలుకు తీసుకొని వరి వేస్తున్నాం. సాగుకు పెట్టుబడి అధికంగా అవుతుండడం, వ్యవసాయంపై ఆసక్తి ఉండడంతో పొలంబాట పట్టా. ట్రాక్టర్ దున్నడం, ఒడ్లు చెక్కడం నేర్చుకున్నా. నారు పోసినదగ్గరి నుంచి ధాన్యం కేంద్రానికి తరలించే వరకు అన్ని పనులూ చూసుకుంటా.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



వేములవాడ రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని తరించారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

రాజన్న కోడెలపై శ్రద్ధ వహించాలి

వేములవాడ కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ కోడెలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తిప్పాపూర్‌లోని రాజన్న ఆలయ గోశాలను శుక్రవారం తనిఖీ చేశారు. గోశాల ఆవరణ, అక్కడ చేపడుతున్న పనులను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా పశుసంవర్ధక అధికారి రవీందర్‌రెడ్డి, రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఈఈ రాజేశ్ తదితరులు ఉన్నారు.

గీత కార్మికుల పొట్ట కొడుతున్న ఎన్టీపీసీ



మాట్లాడుతున్న ముడిమడుగుల మల్లయ్య

పాలకుర్తి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని రాణాపూర్ గ్రామ గీత కార్మికుల పొట్టకొడుతున్న ఎన్టీపీసీ యాజమాన్యం తన విధానాలను మార్చుకోవాలని రాష్ట్ర రైతు హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ముడిమడుగుల మల్లయ్య మాట్లాడుతూ నాడు ఎన్టీపీసీ కంపెనీ ప్రారంభ సమయంలో గ్రామానికి చెందిన సుమారు 300 ఎకరాల భూమిలో నీటి నిలువ కోసం కొనుగోలు చేస్తామని నమ్మించి బూడిద నిలువలను ఏర్పాటు చేయడంతో పాటు సోలార్ విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేసిందన్నారు. వందలాది ఎకరాల్లో ఉన్న ఈతవనాన్ని పెద్దపెద్ద మిషన్లతో ధ్వంసం చేస్తోందన్నారు. ఇప్పటికైనా మానుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు ఏగోలపు రాజయ్య గౌడ్, నాగుల నారాయణ గౌడ్, తెలంగాణ ప్రజాస్వామిక ఉద్యమ నాయకుడు ఎరుకల రాజయ్య, నాయకులు బాలగోని కుమార్‌గౌడ్, పడాల రమేష్, మేడగోని రాజయ్య, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరిగే జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన షూటింగ్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభచాటిన అల్ఫోర్స్ స్కూల్ క్రీడాకారులు భూక్య శ్రీవిద్య, మేకల వర్షిత్‌కుమార్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని షూటింగ్‌బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ ముఫాజిల్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను డీవైఎస్‌వో వి శ్రీనివాస్‌గౌడ్, ఒలింపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్దన్‌రెడ్డి, షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ ఆరిఫ్, తదితరులు అభినందించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాయికల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూరు గ్రామంలోని పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతి ష్ఠాపనోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ, వేద పండితులు గోసంగారి మహదేశ్ శర్మ, శ్రీధర రాజశేఖర్, గుండయ్య శర్మ, గోవిందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనుపురం శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ ప్రభాకర్, ఆలయ చైర్మన్ భూమారావు, నాయకులు పాల్గొన్నారు.

చదరంగ క్రీడాకారుడికి సన్మానం



క్రీడాకారుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి చదరంగ పోటీలకు ఎంపికైన ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన తాటిపెల్లి విశాల్‌ను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శుక్రవారం శివపల్లిలోని తన నివాసంలో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, విండో మాజీ డైరెక్టర్ రంగు శ్రీనివాస్, ధర్మారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కేశెట్టి రాఘవేంద్ర, చదరంగం క్రీడాకారుడు కేశెట్టి రిషిరాజ్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

హుజూరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో చోటు చేసుకున్న రెండు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. హుజూరాబాద్ పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ వద్ద టాటా ఏసీ వాహనం మోటర్ సైకిల్‌ను ఢీ కొట్టడంతో మండలంలోని జూపాక గ్రామానికి చెందిన సుమన్, భరత్ అనే వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పట్టణంలోని పాత రిలయన్స్ పెట్రోల్ బంక్ ఎదుట బోలేరో వాహనం డివైడర్‌ను ఢీ కొట్టి పల్టి కొట్టగా మోటర్ సైకిల్‌పై పడింది. దీంతో చెల్పూర్ గ్రామానికి అంజయ్, కుమారస్వామిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం పట్టివేత

రామడుగు, డిసెంబరు 27(ఆంధ్యజ్యోతి): మండలంలోని వెలిశాల గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. వెలిశాల గ్రామంలోని ఇందిరానగర్ లో అక్రమ మద్యం అమ్ముతున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు రామడుగు పోలీసులు భూక్య రవి అనే వ్యక్తి నిర్వహిస్తున్న కిరాణా దుకాణంలో తనిఖీ చేశారు. 15 లీటర్ల లిక్కర్ బాటిళ్లు పట్టుబడ్డాయని వీటి విలువ సుమారు 6వేల రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు

గుట్టపై బండరాళ్లు కొట్టడం.. వాటిని అమ్మగా వచ్చిన డబ్బులతో కడుపు నింపుకోవడం..ఇదే ఆ వడ్డెరుల జీవన విధానం. చదువు లేక మరో ఆలోచన రాకపోవడంతో ఏళ్లుగా అలానే మగ్గిపోతూ వస్తున్నారు. ఆ రోజు గడిస్తే చాలు అనుకునే జీవితాలు వారివి. మరో ఉపాధి లేకపోవడంతో రాను రాను కుటుంబ పోషణ భారంగా మారింది. కాలనీలో వసతులు లేవని ఎన్నిసార్లు నాయకులకు చెప్పినా మార్పు మాత్రం కనిపించలేదు. విసుగు చెంది తమ బతుకుల్లో మార్పు కోరుకున్నారు. మార్పు రావాలంటే కాలనీ వీడాలని ఆ దిశగా అడుగులు వేశారు. మొదట కొంత మంది అనుబంధ కాలనీకి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతకుంటకు వలస దారి పట్టారు. కొందరు ఉపాధి నిమిత్తం గల్ఫ్ బాట పట్టి ఆర్థికంగా ఎదిగారు. పిల్లలను చదివించడం, వ్యవసాయ భూములు కొనడం, కిరాణ దుకాణాలు నడపడం ఇలా వారి జీవితాల్లో అనేక మార్పులు తెచ్చుకున్నారు.



చింతకుంట కాలనీలో శిథిలమైన పురాతన ఇళ్లు



చింతకుంటలో కొత్తగా నిర్మించుకున్న కాలనీ

'బండ' బారిన బతుకుల్లో 'కొత్త' వెలుగులు

- వనం వీడి జనంలోకి రావడంతో మార్పు
- ఉన్నత చదవులు, ఆర్థిక ఎదుగుదలకు దోహదం
- చింతకుంట వడ్డెర కాలనీ వాసులకు అందిన ఆధునికత

కథలాపూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బండ కొడితేగానీ బతుకు బండి సాగని కడు పేదరికంతో మగ్గిపోయిన వడ్డెరులు వనం వీడి జనంలోకి రావడంతో ఆధునికత వైపు వడి వడిగా అడుగులు వేశారు. అనుక్షణం అటు పోలీసులు, ఇటు నక్సలైట్ల బూట్ల చప్పుళ్ల, తూటాల వర్షంతో వణికిన చింతకుంట కాలనీ వాసులు కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టారు. తాత, ముత్తాతల నుంచి చదువు సంధ్య లేక కేవలం గుట్టపై ఉన్న బండలను పిండి చేస్తూ జీవన యానం సాగించారు. 1970-75 ప్రాంతంలో అప్పటి ప్రభుత్వం పెంకుటిళ్లు నిర్మించగా ఇళ్లల్లోనే దాదాపు 150 కుటుంబాలు కాలం వెళ్లదీశారు. చుట్టు పక్కన గ్రామాల్లో ఇల్లు నిర్మిస్తే గుండు, బేట్ రాయి, దొడ్డు, సన్న కంకర ఎడ్ల బండ్లలో తీసుకెళ్లి విక్రయించే వారు. బండలను విక్రయించం మినహా మరో ఉపాధి అవకాశం లేకపోవడం వల్ల కుటుంబ పోషణ భారంగా మారింది. ఏ చిన్న పనికైనా కిలోమీటర్ల కొద్ది నడిచి రావాల్సి వచ్చేది. ఈ విపత్కర పరి స్థితుల నుంచి బయట పడాలనే ఆలోచనతో అడవీ ప్రాంతం నుంచి పదేళ్ల కిందట మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతకుంటకు ఒక్కొక్క కుటుం బం తరలివచ్చింది. వడ్డెర కాలనీలో 15 ఏళ్ల కిందట ప్రభుత్వం పాఠశాల నిర్మించినా ఎవరూ చదువుకునేందుకు వెళ్లకపోవడంతో మూసివేతకు గురైంది.



గ్రామపంచాయతీ భవనం

● వనం వీడాకే...

తరాలుగా వనంలోనే జీవనం గడిపిన వడ్డెరులకు కాలనీలో అరకొర వసతులే ఉండేవి. ఎన్నిసార్లు నాయకులకు విన్నవించినా ఫలితం కనిపించకపోవడంతో కాలనీ నుంచి వెళ్లిపోతేనే బతుకులు మారతాయనుకున్నారు. ఇన్‌ఫార్మర్ల నెపంతో ఓ వ్యక్తిని నక్సలైట్లు కాల్చివేయడం, ఇద్దరి వేళ్లు నరికివేసిన ఘటన మరింత కలిచి వేసింది. క్షణ క్షణం భయం భయంగా జీవితం గడపడం ఇష్టం లేక మొదట కొన్ని కుటుంబాలు చింతకుంటకు వలస వచ్చాయి. తదనంతరం గడిచిన పదేళ్లలో చింతకుంట అనుబంధ కాలనీ పూర్తిగా ఖాళీ అయింది. ఈ క్రమంలో పిల్లలకు ఉన్నత విద్య అంది జ్ఞానవంతులయ్యారు. ఇంటికొకరు చొప్పున గల్ఫ్ దేశాలకు వెళ్లడంతో ఒక్కసారిగా ఆర్థిక పరిస్థితులు మెరుగు పడ్డాయి. ఆధునిక హంగులతో కాలనీలో నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. ట్రాక్టర్లు, వ్యవసాయ భూములు కొనుగోలు చేశారు. పలువురు కిరాణా దుకాణాలు, హోటళ్లు నడుపుతూ ఉపాధి పొందుతున్నారు. 30 మంది దాకా ఇంటర్, పలువురు డిగ్రీ వంటి ఉన్నత చదువులు చదువుతున్నారు. కుటుంబాలన్నీ పాత వృత్తిని మానేసి విముక్తులయ్యారు.

ఎన్నో కష్టాలు అనుభవించాం

- వేముల చిన్నరాజం



చీకటి అలుముకుంటుందంటే చాలు కాలనీ భయంతో కాలం వెళ్లదీసేది. పొద్దంతా బండ కొట్టడం, పొయ్యిల కట్టెలు చుట్టు పక్కన ఉన్న గ్రామాలకు వెళ్లి అమ్ముకునే వాళ్లం. పూట గడవడమే గగనంగా ఉండేది. వ్యవసాయ భూములు లేక రేషన్ బియ్యంతోనే కాలం గడిపినం. తాత తండ్రుల నుంచి వచ్చిన బండ కొట్టే వృత్తినే నమ్ముకుని బతికాం. చిన్ననాటి నుంచి ఎన్నో కష్టాలు పడ్డాం.

పదేళ్లు గల్ఫ్ వెళ్లి కుటుంబాన్ని పోషించా

- గండికోట దుర్గయ్య, వలసజీవి



ఎటు చూసినా ఇంటివద్ద ఎలాంటి ఉపాధి లేకపోవడంతో కుటుంబాన్ని పోషించడం గగనంగా మారింది. విధిలేని పరిస్థితుల్లో గల్ఫ్ వెళ్లాల్సి వచ్చింది. ఆర్థికంగా కొంత మెరుగు పడడం వల్ల పిల్లలను ఇంటర్ దాకా చదివించాను. ప్రస్తుతం చింతకుంటకు వచ్చి కొత్త కాలనీలో ఉంటున్నందు వల్ల ఈ తరం వాళ్లలో మార్పు వచ్చింది.

ఎంబీఏ పూర్తి చేశాను

-వేములకృష్ణ, యువకుడు



అడవుల నుంచి గ్రామానికి వచ్చి స్థిరపడడంతో చదువుకునే అవకాశం లభించింది. తల్లిదండ్రులు పలు ఉపాధులతో చదివించ డంతో ఎంబీఏ పూర్తి చేశాను. ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవు తున్నా. తాత, తండ్రులు పూర్వ కాలనీలో పడ్డ ఇబ్బం దులను చెబితే మనోవేదన చెందాను. పాఠశాల దగ్గరే ఉండడం వల్ల ప్రతీ ఇంటి నుంచి పిల్లలు చదువుకుంటున్నారు.

కొనసాగుతున్న శతచండీ

మహా సుదర్శన యాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపేట గ్రామంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో మూగు రోజుల నుంచి జరుగుతున్న శతచండీ మహాసుదర్శన నారసింహ యాగం కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు తదితర కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీచక్రపాణి వామనా చార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. మెట్‌పల్లి, మల్లాపూర్ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తమ కుటుంబ సమేతంగా తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. వేదపండితులు శ్రీహరితీర్థస్వామి, శ్రీచక్రపాణి వామనాచార్యుల వేదమంత్రోత్సవాల మధ్య స్థాపిత దేవతా ఆరాధనలు, చండీపారాయణము, సుదర్శనము, హవనములు వంటి కార్యక్రమాలు నిర్వహించినంతరం తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. శనివారం ముగింపు ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మ, స్వామి వారిలను దర్శనం చేసుకోవాలని పురోహితులు, ఆలయ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ కుమార్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపినంతరం పురోహితులు శాలువతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ, గామాభివృద్ధి కమిటీ నాయకులు, సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి



ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. నియోజకవర్గ కేంద్రంలోని కార్యాలయంలో శుక్రవారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలకు పదోన్నతి లభించగా ప్రొసీడింగ్స్‌ను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లంతకుంట, కందికట్కూర్, ఒగులాపూర్ గ్రామాలలో పనిచేస్తున్న అంగన్‌వాడీ ఆయాలకు టీచర్లుగా నియామించడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, అంతగిరి వినయ్‌కుమార్, అయిలయ్య, కేశవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అమర్‌గౌడ్, తిరుపతి, భాస్కర్, ఉప్పల అమర్, ఒగ్గు రమేష్, నరేష్, రాజేందర్‌రెడ్డి, మంద పెద్దబాల్‌రెడ్డి, జమాల్ పాల్గొన్నారు.

అయ్యప్ప శరణు ఘోష

» వైభవంగా పదునెట్టాంబడి మహోత్సవం » ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ ప్రత్యేక పూజలు



భక్తులకు హారతి చూపుతున్న వేదపండితుడు



స్వామి వారి పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కోరుట్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్వామియే శరణం అయ్యప్ప.. అను నామస్మ రణతో కోరుట్ల పట్టణం పులకరించిపోయింది. కేరళ రాష్ట్రంలోని శబరిమల పుణ్యక్షేత్రంలో జరిపే మండల పూజను పురస్కరించుకొని జాతరోత్సవాన్ని పట్టణంలోని అల్ల మయ్య గుట్ట ప్రాంతంలో వెలిసిన జ్ఞాన సరస్వతి శనైశ్చరస్వామి సమేత అయ్యప్ప దేవాలయంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. జగిత్యాల, సిరిసిల్ల, నిర్మల్, నిజామాబాదు జిల్లాల నుంచి అయ్యప్ప స్వాములు, భక్తులతో పాటు కోరుట్ల పట్టణానికి చెందిన వేల మంది భక్తులు అయ్యప్ప స్వామి జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదపండితులు పాలెపు రాంశర్మ, వినయ్, కపిల్ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ అభివృద్ధి కమిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో పదునె ట్టాంబడి మహోత్సవం భక్తుల కరత్వాల ధ్వనుల మధ్య కన్నుల విందుగా సాగింది. ఉదయం ఆలయంలో పదునెట్టాంబడికి ప్రత్యేక పూజలు నిర్వహించి కర్పూర హారతులను అందించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన మహోత్సవ కార్యక్రమాన్ని గురు స్వాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర భజన మండలి అధ్యక్షుడు గట్ల అనంద్ ఆధ్వర్యంలో భజనా కార్యక్రమం చేపట్టారు. అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథం ద్వారా అల్లమయ్యగుట్ట ప్రాంతంలో రథయాత్ర నిర్వహించారు. శోభాయాత్రకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకుతూ రోడ్డు వెంబడి నీటి బిందెలతో రహదారిని శుభ్రపరిచారు. అయ్యప్ప స్వాములు, కుల సంఘాల సభ్యులు స్వామి వారికి వస్త్రాలను బహుకరించి మొక్కులు చెల్లించు కున్నారు. మహిళలచే కుంకమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య-అనిల్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌లు ప్రత్యేక పూజ ల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో జ్ఞాన సరస్వతి, శనైశ్వర స్వామి అయ్యప్ప దేవాలయ అయ్యప్ప అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు చిద్రాల నారా యణ, అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్‌తో పాటు కమిటీ సభ్యులు కౌన్సి లర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అయ్యప్ప దీక్షతో ఆధ్యాత్మిక చింతన చేకూరుతుందన్నారు. ఆల యానికి మొదటి సారిగా విచ్చేసిన ఆది శ్రీనివాస్‌కు వేదపండితులు స్వాగతం పలికారు. కోరుట్ల నియో జకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావును కలుపుకుని ఆలయ అభివృద్ధి చేస్తానని తెలిపారు.

● పోలీసుల భారీ బందోబస్తు...

అయ్యప్ప జాతర మహోత్సవానికి కోరుట్ల సర్కిల్ పరిధిలోని పోలీసులు ప్రత్యేక బందోబస్తును నిర్వహించారు. మెట్‌పల్లి డీఎస్పీ అడ్డూరి రాములు పర్యవేక్షణలో మెట్‌పల్లి సీఐ కోరుట్ల ఇన్‌చార్జి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పత్ర్యేక మొబైల్ పార్టీల ద్వార పెట్రోలింగ్ నిర్వహించారు.

కోరుట్ల రూరల్: పట్టణంలో మాస్ట్రో కళాశాల ఆధ్వర్యంలో అ య్యప్ప స్వామి జాతర మహోత్సవానికి పాల్గొనే భక్తుల కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలను నుంచి తరలివెళ్లే భక్తులను అయ్యప్ప గుట్ట ప్రాంతం తరలించేలా చర్యలు తీసుకున్నారు.

అయ్యప్ప పడిపూజ మహోత్సవం



పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

చొప్పదండి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ వేంకటేశ్వ ర-మణికంఠ ఆలయ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అయ్యప్ప మహాపడిపూజను వైభవంగా నిర్వహించారు. భాష్యం శ్రీనివాస్ గురు స్వామి, ఆలయ ప్రధానార్చకుడు పోలోజు చరణాచార్యుల ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్య, విగ్రహాలకు 108 కళాశాలతో అయ్యప్పకు ప్రత్యేక అభిషేకం చేశారు. కార్యక్రమంలో చైర్మన్ బొడిగె వెంకటేశ్, భాష్యం శ్రీని వాస్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు చేపూరి హేమ, నలుమాచు జ్యోతి, ఆలయ గౌరవాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ వార్షికోత్సవం వాయిదా

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో శుక్రవారం కళాభారతిలో నిర్వహించాల్సిన కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ వార్షికోత్సవాన్ని వాయిదా వేసినట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు జి కృపాదానం ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరితేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

గోదాదేవికి సారె సమర్పణ

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక భగత్‌నగర్ జడ్పీ క్వార్టర్స్ ఆవరణలో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మేయర్ యాదగిరి సునీల్‌రావు సతీమణి అపర్ణాసునీల్‌రావు మహిళలతో కలసి శుక్రవారం ఊరేగింపుగా వెళ్లి గోదాదేవికి సారె, ఒడి బియ్యం సమర్పించారు. కార్యక్రమంలో ఈవో కొన్న కాంతారెడ్డి, అండాళ్ గోష్ఠి సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలు బంద్

ఇల్లందకుంట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంకు లావాదేవీలు నాలుగు రోజుల పాటు నిలిపి వేస్తున్నట్లు బ్యాంకు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు శాఖలను తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం చేస్తూ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేస్తున్నారన్నారు. దీంతో డిసెంబరు 28నుంచి 31వరకు ఆన్‌లైన్, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలకు అంతరాయం కలుగనుంది. మళ్లీ జనవరి 1 నుంచి బ్యాంకు లావాదేవీలు యథావిధిగా అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

తిమ్మాపూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి కరీంనగర్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామానికి చెందిన కుటుంబసభ్యులు గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి వద్ద రోడ్డుప్రమాదంలో గాయపడిన పొలవేణి గట్టుబాబు, మాడిషెట్టి అశోక్, అహల్య వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే ఆసుపత్రులకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదగోని లక్ష్మీనారాయణగౌడ్ ఉన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి





డీసీసీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, శంకరపట్నంలో నివాళులర్పిస్తున్న నాయకులు, అల్ఫోర్స్‌లో..

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై జిల్లా వ్యాప్తంగా పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం నివాళి అర్పించారు. నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మానకొండూరు ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మన్మోహన్ సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు క్రిస్టియన్ మైనార్టీ నేత బొబ్బిలి విక్టర్ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నాయకులు ఎండీ తాజ్, వైద్యుల అంజన్‌కుమార్, పులి అంజనేయుల గౌడ్, కర్ర సత ప్రసన్నరెడ్డి పాల్గొన్నారు.

● మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు తెలిపారు.

● మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపై సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కలెక్టరేట్‌లో, జిల్లాపరిషత్ కార్యాలయంతోపాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని అవనతం చేశారు. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. వారం రోజులపాటు సంతాపదినాలుగా ప్రకటించారు.

కరీంనగర్ టౌన్: ప్రధానిగా అనేక సంస్కరణలతో దేశాన్ని ఆర్థికంగా గట్టెక్కించిన మన్మోహన్‌సింగ్ ఆకస్మిక మృతిపై మేయర్ యాదగిరి సునీల్‌రావు తీవ్ర దిగ్ర్భాంతిని వ్యక్తం చేశారు.

సుభాష్‌నగర్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటని రైతు, ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్‌ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ అన్నారు.

భగత్‌నగర్: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో భారతదేశమాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంస్మరణ సభనిర్వహించారు. ఈసందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

- భారతదేశ జీడీపీని వృద్ధిచేసిన ఘనత దేశ ప్రధానిగా మన్మోహన్‌సింగ్‌కే దక్కుతుందని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయకార్యదర్శి పైడిపల్లి రాజు కొనియాడారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

- మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కంకణాల అనిల్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు.

హుజూరాబాద్: దేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి తీరని లోటని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్, రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు వేర్వేరుగా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా పలువురు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

జమ్మికుంట రూరల్: పట్టణంలోని గాంధీచౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేశ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎర్రం సతీష్ రెడ్డి, మొలుగూరి సదయ్య, గూడెపు సారంగపాణి, ముద్దమల్ల రవి, ఎండీ సజ్జు, పాతకాల అనిల్, కౌన్సిలర్లు దిడ్డి రాము, రావికంటి రాజు, శ్రీపతి నరేష్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలకేంద్రంలోని ప్రధాన కూడలిలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శంకరపట్నం: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సైదాపూర్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల అాధ్యక్షుడు దొంత సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగాడి రాజిరెడ్డి, కర్ర తిరుపతిరెడ్డి, సాహెబ్ హుస్సేన్, ఎండీ ఎజాజ్ పాషా, కాంతాల కొండాల్‌రెడ్డి, దిలీప్, ఎండీ హాజీమియా, దాసరపు రాకేష్, అయిలయ్య, ఓదెలు, పోచాలు, బాబురావు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: ఎల్ఎండీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, పడాల శంకరయ్య, పోలు రాము, మామిడి అనిల్‌కుమార్, పోలు రమేశ్, కొత్త తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: గంగాధర వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో గంగాధర సింగిల్‌విండో చైర్మన్ దూలం బాలగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మెన్ వేముల భాస్కర్, డైరెక్టర్లు ఆకుల అంజయ్య, బెజ్జంకి కళ్యాణ్, కోల మల్లయ్య, పొన్నం రాములు, కార్యదర్శి గాలిపెల్లి రమేశ్‌పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండిలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల గంగయ్యగౌడ్, కౌన్సిలర్ కొట్టె అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ సైకత శిల్పం



కరీంనగర్ కల్చరల్: మాజీ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సైకత శిల్పాన్ని మంకమ్మతోటలోని తన నివాసంలో జాతీయస్థాయి సైకత శిల్పి రేవెల్లి శంకర్ రూపొందించి నివాళులర్పించారు.

అభివృద్ధి అంతంత మాత్రమే

(5వ పేజీ తరువాయి)

పూజచేసి వదిలిపెట్టారేగాని పనులు జరుగడం లేదు. దుర్శేడ్ పాత వంతెన పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోటి 80 లక్షలు మంజూరు చేయగా కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారు.

మండలాల్లో జరుగుతున్న పనులు..

గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మాణ పనులు చేపడుతున్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని చొప్పదండి మండలంలో గుమ్లాపూర్‌లో 120 కోట్లతో నీటిని తరలించే పనులను ప్రారంభించారు. చిట్యాలపల్లి నుండి గుమ్లాపూర్ వరకు 4 కోట్లతో బీటీ రోడ్, సుడా నిధులు 1.2 కోట్ల కాట్నపల్లి కొక్కెరకుంట రోడ్డు పనులు, ఉపాధిహామీ నిధులు 30 లక్షలతో చాకుంట, భూపాలపట్నం రోడ్డుకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదు. 60 లక్షల రూపాయల ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్లు వేశారు.

● గంగాధర మండలంలో 57.61 కోట్లను వివిధ పనులకు నిధులు మంజూరు చేశారు. ఉపాధిహామీ తో 3 కోట్లతో రోడ్లు, పాఠశాల కంపౌండ్ పనులను పూర్తి చేశారు. కాసారం నుంచి గర్శకుర్తి 2.46 కోట్లతో పనులు చేపడుతున్నారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేట నుంచి గంగాధర మండలం బూర్గుపల్లి వరకు ఎనిమిది కోట్లతో రోడ్డు పనులు చేపడుతున్నారు.

● రామడుగు మండలంలో రెండు కోట్ల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లు పనులు పూర్తి చేశారు. మరో కోటి రూపాయల నిధులను గ్రామీణ లింక్ రోడ్లకు మంజూరు చేసినా పనులు ప్రారంభించలేదు. సుడా నిధులతో కోటి 20 లక్షలతో కొక్కెరకుంట, కాట్నపల్లి రోడ్‌కు నిధులు విడుదల చేసినా పనులు జరుగడం లేదు.

● తిమ్మాపూర్‌లో ఉపాధి హామీ నిధులు కోటి 80 లక్షలతో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం చేపట్టారు. కోటి 40 లక్షల ఎస్‌డీ ఎఫ్ నిధులు మంజూరీ కాగా 60 లక్షల పనులు పూర్తికాగా, మిగిలిన పనులు ప్రగతిలో ఉన్నాయి. సీఆర్ఆర్ నిధులు 3 కోట్లతో కొత్తపల్లిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోటి రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రాజీవ్‌రహదారి నుంచి తిమ్మాపూర్ గ్రామానికి రెండు కోట్లతో రోడ్డు వేయాల్సి ఉండగా టెండర్ ప్రక్రియ పూర్తికాలేదు. యాదవులపల్లిలో తెలంగాణ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలకు 225 కోట్లు మంజూరు చేశారు. పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

● మానకొండూర్ మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలో వంతెన నిర్మాణానికి కోటి 50 లక్షల నిధులు మంజూరు కాగా పనులు ప్రారంభించలేదు. మరో 50 లక్షలను అంతర్గత రోడ్లకు మంజూరు చేసినా పనులు ప్రారంభించలేదు.

● శంకరపట్నం మండలంలో కోటి 20 లక్షలతో సీసీ రోడ్లు పూర్తికాగా, ఎస్‌డీఎఫ్ నిధులు కోటి 40 లక్షలతో రోడ్డు పనులు చేపడుతున్నారు. 90 లక్షల ఉపాధి హామీ నిధులతో అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలను నిర్మించాల్సి పనులు ప్రారంభం కాలేదు. 40 లక్షలతో వేయాల్సిన సీసీ రోడ్లు పనులు ప్రారంభించలేదు.

● గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు డబుల్ రోడ్డుకు 72 కోట్లు మంజూరయ్యాయి. పనులు చేపడుతున్నారు. మండల కేంద్రంలో పీహెచ్‌సీ నిర్మాణానికి కోటి 40 లక్షలు మంజూరు కాగా పనులు ప్రారంభించలేదు. గన్నేరువరం నుంచి బేగంపేట వరకు కేంద్ర ప్రభుత్వ నిధులు 32 కోట్లతో పనులు జరుగుతున్నాయి. 80 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రభుత్వం మండలంలో వివిధ అభివృద్ధి పనులకు 52.2 కోట్లను మంజూరు చేయగా పనులు జరుగుతున్నాయి.

● హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని హుజురాబాద్ మండలంలోని దమ్మక్క పేటలో 20 లక్షలతో మంచిపైపులైను నిర్మాణ పనులు చేపడుతున్నారు. పట్టణంలోని పలు రోడ్లకు 55 లక్షలను మంజూరు చేసినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఆదర్శ పాఠశాలకు 30 లక్షల నిధులు మంజూరు చేశారు.

● వీణవంక మండలంలో ఎస్‌డీఎఫ్ నిధులు 78 లక్షలతో సీసీ రోడ్లు, మురికికాలువలు, ప్రహరీల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. రెండు గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. ఉపాధి హామీ నిధులు 60 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

● సైదాపూర్ మండలంలో 36 కోట్లతో సీసీ రోడ్లు, అమ్మ ఆదర్శ పాఠశాల భవనం, అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలు, వ్యవసాయ గోదాం, వాటర్ ప్లాంట్లు, బ్రిడ్జి నిర్మాణ, అంతర్గత రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నారు.

● జమ్మికుంట మండలంలో ఏడాదిలో 2.59 కోట్ల నిధులు మంజూరు కాగా 95 లక్షలతో సీసీ రో డ్లు పనులు చేపడుతున్నారు. వావిలాలో గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉంది. 36 లక్షలతో ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తున్నా పనులు మాత్రం ఆశించిన రీతిలో జరుగడం లేదు.

గ్రామాల్లో పేరుకుపోతున్న ఇళ్ల బకాయిలు

- పన్నుల వసూళ్లలో జాప్యం- అదనపు పనులతో కార్యదర్శులకు చిక్కులు



కరీంనగర్ రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇళ్ల బకాయిలు పేరుకుపోయాయి. గ్రామాల అభివృద్ధికి విధించే పన్నుల వసూలు చేయడంలో పంచాయతీ కార్యదర్శులకు తీవ్ర భారంగా మారింది. మొన్నటి వరకు సమగ్ర సర్వే, మళ్లీ ఇందిరమ్మ సర్వే పేరిట కార్యదర్శులు అదనపు ఒత్తిడికి లోనవుతున్నారు. ఏటా వంద శాతం వసూలు చేసేందుకు ఉత్సాహం ప్రదర్శించే కార్యదర్శులు ఈ సంవత్సరం సర్వేల పేరిట అదనపు పనుల భారంతో పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టలేకపోతున్నారు. మార్చి 31 వరకు వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉండగా, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టినప్పటకీ వసూలు కావడం లేదని తెలుస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం మరో మూడు నెలల గడువు మాత్రమే ఉంది. పన్నులు వసూలు చేసేందుకు అధికారులు కార్యదర్శులకు లక్ష్యాలను నిర్ధేశించారు. మూడు నెలల్లో 1.8 కోట్ల వసూలు చేయాల్సి ఉంది. కరీంనగర్ మండలంలో మొత్తం 17 గ్రామ పంచాయతీలు ఉండగా వంద శాతం పూర్తిచేయాలని ఉద్దేశంతో నవంబరు, డిసెంబరు నెలల్లో 45శాతానికి పైగా పన్నులు వసూలు చేశారు. మొత్తం రెండు కోట్ల 34వేల ఇంటి పన్ను వసూళ్లకు ఇప్పటి వరకు 91లక్షల 84వేల రూపాయలు మాత్రమే వసూలు అయ్యాయి. మిగతా బకాయిలను మూడునెలల్లో వసూలు చేసేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. నిర్ణీత గడువులోగా లక్ష్యం పూర్తిచేసేందుకు పంచాయతీ సిబ్బంది కృషి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. మూడునెలల్లో వంద శాతం లక్ష్యం నెరవేరుస్తామని ఎంపీవో జగన్మోహన్ రెడ్డి తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగంగా పూర్తి చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను వేగంగా, పాదర్శకంగా పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. శుక్రవారం ఆమె నగరంలోని ఆదర్శనగర్, సుభాష్‌నగర్, అంబేద్కర్‌నగర్‌లో పర్యటించి సర్వే ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం హౌజింగ్‌బోర్డులోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఆమె వెంట పలువురు అధికారులు ఉన్నారు.

సన్నాహక సమావేశానికి తరలిరావాలి

జమ్మికుంట రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాదిగ కళాకారుల సన్నాహక సమావేశం నిర్వహించనున్నామని, పెద్ద సంఖ్యలో తరలి రావాలని వెయ్యి గొంతుల-లక్ష డప్పులు మహా కళాప్రదర్శన నిర్వాహణ కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ రామంచ భరత్ కోరారు. స్థానికంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ జనవరి 3నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహించనున్న వెయ్యిగొంతులు-లక్షడప్పుల సన్నాహక సమావేశానికి కళాకారులు తరలివచ్చి విజయంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్ఎస్‌పి రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి, వెయ్యి గొంతులు-లక్ష డప్పుల నిర్వాహణ కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఒల్లాల వాణి, మాదిగ రచయితల వేదిక రాష్ట్ర కో-ఆర్డినేటర్ ముక్కెర సంపత్‌కుమార్, ప్రముఖ డప్పు వరల్డ్ గిన్నిస్ రికార్డు అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని బోర్నపల్లి, కొత్తపల్లి, తుమ్మనపల్లి గ్రామాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు క్రీడా పోటీలు

వీణవంక, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లారెడ్డిపల్లి హైస్కూల్ మైదానంలో ఆదివారం నెహ్రూ యువ కేంద్రం, యువ చైతన్య (ఫ్రెండ్స్) యూత్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కర్రె నాని, రాము, అనిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, కబడ్డీలో గెలుపొందిన వారికి రూ. 4వేల క్రీడా సామగ్రిని, సెకండ్ విన్నర్స్‌కి ట్రోఫీ అందించనున్నామని పేర్కొన్నారు. యువజన సంఘాలు, క్రీడాకారులు క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

మత్తు పదార్థాలు తీసుకోవద్దు

» న్యూఇయర్ వేడుకలు ఇళ్లలోనే జరుపుకోవాలి
» ఏసీపీ శ్రీనివాస్‌జీ

జమ్మికుంట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలు తీసుకోవద్దని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. పట్టణంలో శుక్రవారం రైల్వే స్టేషన్, బస్టాండ్, పాన్‌షాపులు, కిరాణ దుకాణాల్లో పోలీసులు తనిఖీ చేశారు. షాపుల యాజమానులకు సూచనలు చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ కొత్త సంవత్సరం వేడుకలను దృష్టిలో పెట్టుకోని ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎవరైన గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలు సరఫరా చేసినా, వినియోగించినట్లు అనుమానం వచ్చినా సమా చారం అందించాలన్నారు. న్యూ ఇయర్ వేడుక లను ఇళ్లల్లో చేసుకోవాలన్నారు, రోడ్లపైకి వచ్చి హంగామా చేస్తే సహించేది లేదని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వరంగంటి రవికుమార్, ఎస్సైలు తోట తిరుపతి, రాజ్‌కుమార్, ప్రొబేషనరి ఎస్సై భార్గవ్, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంటలో తనిఖీ చేస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ



ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

తిమ్మాపూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో భాగంగా పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా నాయకులు శుక్రవారం మండలంలోని ఎల్ఎండీలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కేతిరి తిరుపతిరెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చొల్లేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులిపాక కిషన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాలరావు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సమస్యలను మండలిలో ప్రస్తావించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాయీబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించాలని తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానాల కిషన్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

హుజూరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డిపో క్రాస్, జమ్మికుంట రోడ్, అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం రాత్రి విస్తృత తనిఖీలు చేశారు. డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా సరైన పత్రాలు లేని వివిధ రకాల 30 వాహనాలను సీజ్ చేశారు. పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లతో పాటు బస్టాండ్, పాన్ షాపులు, లాడ్జీలను తనిఖీ చేశారు. సీఐలు తిరుమల్‌గౌడ్, పులి వెంకట్, ఎస్ఐలు యూనస్ అహ్మద్‌అలీ, తిరుపతి, రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

గంగాధర: మండలంలోని ఆచంపల్లిలో మాజీ సర్పంచ్ కొంకటి శంకర్ తండ్రి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మనోహర్ ఉన్నారు.

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ పరిధిలోని గుడ్డెలుగులపల్లికి చెందిన బట్టూరి పరంధాములు క్యాన్సర్‌తో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

చొప్పదండి: చొప్పదండిలో దారుల్‌ఖైర్ సొసైటీ ముస్లిం సంఘం ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఖుద్దూస్, ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు జహిరొద్దీన్, జమా మజిద్ అధ్యక్షుడు అబిద్ అలీ పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన గౌరిశెట్టి భవానీ (48) గుండెపోటుతో గురువారం మృతి చెందగా కుటుంబసభ్యులు నేత్రదానం చేశారు. భవానీ మృతి విషయం తెలుసుకున్న సదాశయ ఫౌండేషన్ నిర్వాహకులు కళ్లను దానం చేయాలని కుటుంబసభ్యులకు అవగాహన కల్పించారు. వారు ఒప్పుకోవడంతో ఎల్వీపీ టెక్నీషియన్ రాజేంద్రప్రసాద్ సహకారంతో నేత్రాలను సేకరించారు.

చివరి ఆయకట్టుకు నీరందించాలి

కరీంనగర్ రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ రూరల్ మండలంలోని గ్రామాలకు డి-89, 94 కాలువ ద్వారానే రైతుకు సాగు అందుతుందన్నారు. చివరి ఆయకట్టు గ్రామాల వరకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చివరి ఆయకట్టుకు నీరందించకపోతే చలో రేవల్లి(రెగ్యులేటర్ పాయింట్) కార్యకమం చేపడుతామని హెచ్చరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

వీణవంక, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైంది. బత్తిని నరేశ్‌గౌడ్ అనే రైతు పశుగ్రాసాన్ని నిల్వ చేసుకున్నాడు. శుక్రవారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



గోపాల్‌రావుపేటలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

రామడుగు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేటలో హనుమాన్ ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా ఆలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలతో శోభాయాత్రను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డప్పుచప్పులు, కోలాట నృత్యాల మధ్యన ఊరేగిస్తూ విగ్రహాలను ఆలయానికి తరలించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, నేచర్ యూత్‌క్లబ్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.